"మీరు బాధాకరమైన విషయాలు కూడా తమాషాగా చెబుతారు." అంది.

"మీ కాంప్లిమెంటుకు థాంక్స్" కాని ప్రతి విషయానికి బాధపడితే సంతోషం రెక్కలు వచ్చి ఎగిరిపోతుంది. సుఖాన్ని రెండుచేతులూ చాచి అందుకుంటాం కదా, కాని కష్టాల్ని టాలరేట్ చేయకుంటే ఎలా?"

"మీరెంతో అనుభవం వున్నట్టు మాట్లాడుతున్నారు"

శంకర్ తేలిగ్గా నవ్వేసేడు. "గాలికి పెరిగినవాడనండీ మీకు అడుగడుగునా అనుభవాలే. ఇంతకూ అయిదు నిముషాల్లో స్వీయ చరిత్రంతా చెప్పించేసేరు. మీ పేరు చెప్పనేలేదు."

"శైలజ"

"వెరీ నైస్."

"ఇంతకూ మీరు ఎక్కడికి వెళ్తున్నట్లు?"

"హైద్రాబాద్."

"ఓ! మనిద్దరిదీ ఒక్కటే గమ్యం! ఇంతకూ మీ హజ్‌బెండ్ అక్కడ వర్కు చేస్తున్నారా?"

"లేదు మా స్నేహితురాలింటికి వెళ్తున్నాను."

"వెరీగుడ్! స్నేహానికి అంత మాత్రం విలువయిచ్చే వాళ్ళున్నారంటే— ఐయామ్ రియల్లీ హేపీ!"

అతని మాటలకు శైలజ నవ్వింది.

"నిజం!" శంకర్ తమాషాగా కళ్ళు చిట్లించి అన్నాడు.

"చూడండి! చాలామంది మేరేజ్‌తో స్నేహానికి ఫుల్‌స్టాప్ పెట్టేస్తారు. అంతవరకు ప్రాణప్రదంగా ప్రేమించి కలిసిమెలిసి తిరిగిన స్నేహితుల్నిక్కడ మరచిపోయి భర్తల చుట్టూ ప్రదక్షిణం చేస్తారు. సంవత్సరం తిరిగిందో లేదో యిలాంటి కపుల్స్ లైఫ్ వుత్త బోరంటూ ఎడమొగం, పెడమొగంగా తయారయి జీవితంలో ప్రతి చిన్న లోపం భూతద్దంలో చూసుకుని కళ్ళనీళ్ళు పెట్టుకునీ వాపోతారు. దేని విలువ దానికిస్తే ఇలాంటి బాధలు రావని గ్రహించరు."

శంకరాన్ని చమత్కరిస్తున్న నిజాలు విని శైలజ గుండె దడదడలాడింది.

'ఇతను తన గుట్టు కనిపెట్టేయలేదు కదా!' అనుకుంది.

"ఏమిటి పీడిలా బోర్ కొట్టిస్తున్నా దనుకుంటున్నారా?"

"లేదు లేదు. మీ కంపెనీ ఎంతో రిలీఫ్‌గా వుంది."

